ప్రజాశక్తి

శనివారం 2 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఉప్పెనలా ఉక్కు ఉద్యమం

◆ నెల రోజుల్లో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి ◆ రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్‌లో వక్తలు

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై విద్యార్థి, యువజన నాయకులు

మాట్లాడుతున్న చలం

రాజమోహన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోకుంటే ఉప్పెనలా ఎగసిపడతామని విశాఖ వేదికగా జరిగిన రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్‌లో విద్యార్థి, యువజన నాయకులు గర్జించారు. నెల రోజుల్లోగా కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తీర్మానం కూడా చేశారు. విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్‌ను శుక్రవారం తలపెట్టగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. ఉక్కు రక్షణపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, యువకులు హర్షధ్వానాల మధ్య ఆమోదం తెలిపారు. తొలుత అశోక్ మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు ప్రజలంతా పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నారని, నేడు దాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవడం అంటే.. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడమేనని అన్నారు. ముఖ్య వక్తలుగా హాజరైన ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ కెఎస్.చలం, స్టీల్‌ప్లాంట్ నిర్మాణ ఉద్యమ నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు. భావి తరాల భవిష్యత్తు కోసం ఆనాడు విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు నిమిత్తం ఎలా ఉద్యమాలు సాగాయో మిగతా 2లో..

నేడు నగరానికి చంద్రబాబు

◆ కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖల సమీక్ష ◆ సుందరంగా కలెక్టరేట్ ముస్తాబు

◆ స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్ సహా కీలక అంశాలపై సిఎం స్పందించేనా ?

విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు శనివారం విచ్చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లా కలెక్టరేట్‌లోని భవనాలు, ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ఇప్పుడిప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో విశాఖ కూడా ముఖ్యమైనదిగా ఉంది. విశాఖను ఆర్థిక రాజధానిగా చేసేందుకు కృషి చేస్తామంటూ పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు గతం నుంచీ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు రాక విషయమై ఈ ప్రాంత ప్రజానీకం అనేక ఆశలతో నిరీక్షిస్తోంది.

1356 రోజులుగా ఉక్కు పోరాటం

ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయెుద్దంటూ 1356 రోజులుగా కార్మికలోకం, ప్రజానీకం ఉద్యమిస్తోంది. ఎన్నికలు ఫలితాలొచ్చి ఐదు నెలలు అవుతున్న క్రమంలో చంద్రబాబు విశాఖకు వస్తున్నందున స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులే కాకుండా విశాఖ ప్రజానీకం సైతం స్టీల్‌ప్లాంట్‌పై బాబు ఏం ప్రకటన చేస్తారోనన్న ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పటికే స్టీల్ ఉద్యోగులమీద యాజమాన్యం, అటు కేంద్రంలోని బిజెపి తీవ్ర ఆర్థిక దాడులకు పాల్పడుతూ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోన్న నేపథ్యంలో ప్లాంట్ వరకూ చంద్రబాబు స్పందన ఎలా ఉంటుందోన్న చర్చ నడుస్తోంది. పంచగ్రామాల సమస్యపైనా సిఎం ఏం మాట్లాడతారోనన్న మిగతా 2లో..

భూపేష్ నగర్‌లో ఆగిన మద్యం దుకాణం

▶ వార్త 2లో..

పోర్టు ఆసుపత్రిని పిపిపికి అప్పగిస్తే ఊరుకోం

▶ వార్త 4లో..

మొరాయించిన సర్వర్లు

▶ వార్త 3లో..

ధర్నాలో మాట్లాడుతున్న లోకనాథం

అభిజిత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిందే..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం వార్త 4లో..

విశాఖ-విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - విజయవాడ మధ్య జన సాధారణ్ ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08567 విశాఖపట్నం - విజయవాడ జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నం నుంచి నవంబర్ 1, 3, 4, 6, 8, 10, 11, 13వ తేదీల్లో ఉదయం 10.00 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి సాయంత్రం 16:00 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. 08568 విజయవాడ - విశాఖపట్నం జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నవంబర్ 1, 3, 4, 6, 8, 10, 11,13వ తేదీల్లో సాయంత్రం విజయవాడలో 18.30 గంటలకు బయలుదేరి రాత్రి 00.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు గన్నవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ మీదుగా ప్రయాణిస్తాయి.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

ప్రయాణికులకు మిగతా 2లో..

ఎంవిపి క్రైమ్ ఎస్ఐ సస్పెన్షన్

ఇంటి పనిమనిషిపై దాడి నేపథ్యంలో సిపి చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఆక్సిజన్ టవర్స్‌లో ఇంటి పనిచేస్తున్న గంగపై పోలీసుల దాడి పట్ల నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ స్పందించారు. క్రైమ్ ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరిపి ఎంవిపి క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎన్.జగదీష్‌పై చర్యలు తీసుకున్నారు. ఆయన్ని విధుల నుంచి తప్పించారు. అదేవిధంగా ఈ సంఘటనలో ద్వారకా సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ డి.బంగారు పాపపైనా శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. నగర ప్రజలు ఎటువంటి ఫిర్యాదులనైనా 7995095799 నెంబర్‌కు తెలియజేయవచ్చునన్నారు.

సిఐటియు హర్షం

విశాఖ కలెక్టరేట్ : ఇంటి పనిచేసుకుని బతికే గంగను కొట్టిన విషయంలో క్రైమ్ ఎస్ఐ జగదీష్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడమే కాకుండా అతనికి సహకరించిన సిఐ బంగారు పాపపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించినందుకు సిపికి సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తరుపున సంఘం జిల్లా కార్యదర్శి పి.మణి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఘటనకు కారకురాలైన ఆక్సిజన్ టవర్స్‌లో 820 ఇంటి ఓనర్ ప్రియాంకపై పూర్తి స్థాయి విచారణ చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పోలీసుల అన్యాయానికి గురైన గంగకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. శనివారం విశాఖ పర్యటనకు వస్తున్న సిఎం చంద్రబాబు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటి పనివారికి భద్రత కల్పించాలి : ఐద్వా

రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పనిచేసుకుని బతికే మహిళలకు భద్రత కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆక్సిజన్ టవర్స్‌లో వేధింపులకు గురవుతున్న ఇంటిపనివారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ పోలీసులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి..

నేడు నగరానికి చంద్రబాబు

ఆసక్తి అందరిలో ఉంది.

ప్రాజెక్టులకు మోక్షం లభించేనా ?

విశాఖ అంటేనే అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలకు నిలయం. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ భవన శంకుస్థాపన ఏనాటి నుంచో జాప్యం జరుగుతోంది. ఈ డిసెంబరు నెలాఖరులోపు కేంద్రం దీనికి పునాదిరాయి వేసి పనులు చేపట్టనుందన్న అంశాన్ని చంద్రబాబు చెప్పే అవకాశాలున్నాయి. విశాఖకు మెట్రో సహా పలు రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌లు (ఫ్లై ఓవర్ బ్రిడ్జిలతో సహా) నిర్మాణం జరిగితేనే ట్రాఫిక్ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. విశాఖ కేంద్రంగా టిసిఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే ఐటి మంత్రి నారా లోకేష్ ప్రకటన చేశారు. 10 వేల మందికి ఇక్కడే ఐటి ఉద్యోగాల హామీ కూడా లభించింది. ఇవన్నీ సాకారం కావాలన్న కాంక్ష విశాఖ యువత నుంచి వ్యక్తమవుతోంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల్లో జాప్యం

విశాఖపట్నం జిల్లాకు సంబంధించి నాలుగు క్వార్టర్ల స్కాలర్‌షిప్‌లకుగానూ ఒక్క క్వార్టరే గతంలో వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కటంటే ఒక్క క్వార్టరుకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదు. 2023-24 బకాయిలు 3 క్వార్టర్‌లు ఉండిపోయాయి. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ జిల్లాకు సంబంధించి సుమారు రూ.4 కోట్లు పెండింగులో ఉండిపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అవస్థలకు గురౌతున్నారు. తమ పిల్లలను కష్ట, నష్టాల నడుమ చదివించుకుంటున్నామని, తమపై విద్యాసంస్థల యాజమాన్యాల తీవ్ర ఒత్తిడి ఉందని వారంతా వాపోతున్నారు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆగిపోవడంపై వారు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

బాబు పర్యటన ఇలా..

ఎంవిపి.కాలనీ : సిఎం చంద్రబాబు శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు గజపతినగరం నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి 1.05కి విశాఖపట్నం కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అక్కడి నుంచి 1.10 గంటలకు బయలుదేరి 1.15కి విశాఖపట్నం కలెక్టరేట్‌కు వస్తారు. అనంతరం అక్కడ మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు ఉత్తరాంధ్ర జిల్లాల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 4.35 గంటలకు విశాఖపట్నం కలెక్టరేట్ నుండి బయలుదేరి 4.40 గంటలకు నేవీ కోస్టల్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకొని, అక్కడి నుండి ప్రత్యేక హెలీకాప్టర్‌లో 4.45 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అనంతరం అక్కడ నుంచి 5.05 గంటలకు విమాన మార్గంలో సాయంత్రం 6.00 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

విశాఖ-విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 08557 విశాఖపట్నం - చెన్నయ్ ఎగ్మోర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 2, 9, 16, 23, 30 తేదీల్లో, 08558 చెన్నయ్ ఎగ్మోర్ - విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 3, 10, 17, 24, డిసెంబర్ 1 తేదీల్లో ఒక థర్డ్ ఎపి ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేయనున్నారు. అదేవిధంగా 08539 విశాఖపట్నం - కొల్లాం స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 6, 13, 20, 27 తేదీల్లో, 08540 కొల్లాం - విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 7, 14, 21, 28 తేదీల్లో ఒక థర్డ్ ఎసి ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేయనున్నారు.

భూపేష్ నగర్‌లో ఆగిన మద్యం దుకాణం

- మహిళల పోరాట విజయం

విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యవతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధిలోని భూపేష్ నగర్ (చావుల మదుం) ప్రాంతంలో మెడికల్ షాపును తొలగించి మద్యం షాపును ఏర్పాటు చేయడం కోసం చేసిన ప్రయత్నాలను మహిళలు తిప్పికొట్టారు. 14 రోజులపాటు ఐద్వా తోడ్పాటుతో స్థానిక మహిళలు, ప్రజలు చేసిన ఆందోళనకు విజయం లభించింది. మహిళల అభ్యర్థనను మన్నించి ఈ ప్రాంతంలో కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేయటం లేదని స్థానిక ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ ఆ ప్రాంతానికి వచ్చి ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం నిరసన జరిపిన ప్రాంతంలో కాలనీవాసులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ మద్యం షాపు పెట్టనీయకుండా పోరాటం చేసి విజయం సాధించుకున్న కాలనీవాసులందరికీ శుభాకాంక్షలు, జేజేలు తెలిపారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అయితే భూపేష్ నగర్‌లో మద్యం షాపు వద్దని జరిగిన ఆందోళనతో షాపు ఏర్పాటు చేయటం లేదని ఎమ్మెల్యే చెప్పడం హర్షించదగిన విషయమన్నారు. స్థానిక నాయకురాలు ఎరుకమ్మ మాట్లాడుతూ ఇక్కడ మళ్లీ మద్యం దుకాణం తెరిస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, ఐద్వా జగదాంబ జోన్ నాయకులు ఆర్.వరలక్ష్మి, కె.మణి, సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, ప్రజా సంఘాల నాయకులు కెవిపి చంద్రమౌళి, కె.చంద్రశేఖర్, బేగం పాల్గొన్నారు.

ఉప్పెనలా ఉక్కు ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి..)

వివరించారు. 32 మంది బలిదానంతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్ ఎంతో విశిష్టమైనదన్నారు. నాడు కర్మాగారానికి కేంద్రం కేవలం రూ.4500 కోట్లను మాత్రమే ఇచ్చిందన్నారు. ప్రస్తుతం సుమారు మూడున్నర లక్షల విలువైన ఆస్తులు ప్లాంట్‌కు ఉన్నాయని తెలిపారు. ఉక్కు కర్మాగారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.50 వేల కోట్లును వివిధ రకాల పన్నుల రూపంలో చెల్లించినట్టు తెలిపారు. బంగారు బాతు వంటి ఈ కర్మాగారాన్ని పోస్కో కంపెనీకి అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ హామీకి సిఎం చంద్రబాబు కట్టుబడి ఉండాలన్నారు. మంచి కుక్కను చంపాలంటే, పిచ్చికుక్క అని ముద్ర వేసి చంపేస్తారని, ఇప్పుడు కేంద్రంలోని బిజెపి పాలకులు విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల అదే వైఖరి అవలంబిస్తున్నారని నర్సింగరావు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో అనేక రకాల తప్పుడు ఆరోపణలు చేస్తూ, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతూ, ప్రైవేటీకరణ కుట్రలను అమలు జరుపుతున్నారన్నారు. వాటిని గ్రహించి రాష్ట్రంలోని యావత్తు యువకులు, విద్యార్థులు ఐక్యమై గర్జించి ఎదిరించే పరిస్థితి వచ్చిందని చెప్పారు. అందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జాన్సన్ బాబు, పిడిఎస్ఒ రాష్ట్ర నాయకులు భాను, ఎఐడిఎస్ఒ రాష్ట్ర కార్యదర్శి హరీష్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు యుఎస్ఎన్.రాజు, సంతోష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పల్లవి, సౌమ్య, రామ్మోహన్, విద్యార్థి సంఘాల నాయకులు యు.నాగరాజు, అభిలాష్, విశ్వనాథం, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అయోధ్యరాం, రామస్వామి, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

హాజరైన విద్యార్థులు, యువతీ యువకులు

ముఖ్యమంత్రి తన హామీని నిలబెట్టుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉక్కును పరిరక్షిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మాటను నిలబెట్టుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రాభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎంవిపి.కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్‌కు వచ్చే నెలలో శంకుస్థాపన జరగనుందని, గత ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ కార్యాలయానికి కనీసం స్థలాన్ని సైతం కేటాయించలేదని తెలిపారు. జగన్ వల్ల రాష్ట్రం నుంచి తరలిపోయిన పరిశ్రమలు నేడు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కృషితో విశాఖలో 10 వేల మందికి ఉపాధి కలిగించేలా టిసిఎస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందన్నారు. రూ.70 వేల కోట్లతో 73 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో ఆర్సెలాల్ మిట్టల్, నిప్పన్ స్టీల్స్ సంయుక్త భాగస్వామ్యంలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్ మొదటిదశ 2029కి పూర్తవుతుందని, ఈ ప్లాంట్ 20 వేల మందికి ఉపాధి కల్పించనుందని అన్నారు. వైసిపి పూర్తిగా మునిగిపోయిన పడవ అని ఎద్దేవా చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలో నడిపించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. సమావేశంలో జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, టిడిపి నాయకులు కోరాడ రాజబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జీర్ణ ప్రక్రియ సమస్యలకు లేహ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దీపావళి వంటి పండగల సందర్భంలో వివిధ రకాల స్వీట్లు, సావరీస్‌తో సంతోషంగా పండగలను జరుపుకుంటున్న సందర్భంలో పలువురు తరచుగా జీర్ణ ప్రక్రియకు సంబంధించిన సమస్యలతో బాధపడుతుంటారని, అటువంటి వారికి దీపావళి లేహ్యం అద్భుతమైన నివారిణి అని శ్రీ వర్మ ఆయుర్వేద హాస్పటల్ డైరెక్టర్ గౌతమ్ కృష్ణమూర్తి మీడియాకు తెలిపారు. శరీరంలోని టాక్సిన్‌లను బయటకు పంపడానికి ఈ లేహ్యం దోహదపడుతుందన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుతుందని పేర్కొన్నారు. ఉత్తేజం ఇస్తుందని అన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: BHEEMUNIPATNAM
F.D.I.A. No.826/2024 in O.S. 306/2023

Between:
Sri Mohan Rao Patro ...Petitioner/Plaintiff
And:
Smt.Telasari Nagaratnam ...Respondent/Defendant

NOTICE

To, **The Respondent:**
Smt. Telasari Nagaratnam, W/o. Sri Telasari Charadhar, R/at D.No.2-2/1, Auto Stand way Pulagalipalem, Visakhapatnam-531173.

Take notice that the above named petitioner/plaintiff has instituted the above F.D.I.A. against you seeking to pass a final Decree in terms of the Preliminary Decree dated 12-04-2024 with subsequent interest and costs; You are hereby summoned to appear before the Hon'ble Court in person or through by a pleader duly instructed and able to answer all material questions relating to the above F.D.I.A on **29-11-2024** at **10:30 A.M.** In default of your appearance on that day the F.D.I.A will be heard and determined in your absence basing on the material available in the court.

(By Order of the Hon'ble Court)
U.S.V. PRASAD & P. SUKUMAR RAO
Advocates,Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 35/2023

Between:
K.J. Harini ... Petitioner
And:
S.K. Mahalaxmi & others ...Respondents

NOTICE

To,
R-3: Sri N.V. Gowrinadh, S/o. N. Siva Prasad, R/at D.No.9-9-73, Mangalapuram Colony, Near Kalabharathi, Sivajipalem, Visakhapatnam.
R-4: Sri R. Srinivasa Rao, D.No.9-130A, Kapu Veedhi, Simhachalam, Adavivaram, Visakhapatnam.
R-5: Sri K. Srinivasa Rao, D.No.9-130A, Kapu Veedhi, Simhachalam, Adavivaram, Visakhapatnam.
R-6: G. Eswaramma, D.No.39-133/66, SF 11, B-Block, Vambay Colony, Near RTO Office, Ambedkar Colony, Marripalem, Visakhapatnam.
R-7: M. Subhadra Devi, W/o. Srinivasa Raju, D.No.58-8-86, FCI Nagar, Near Railway College, Near Siri Enclave, Rana Pratap Nagar, Marripalem, Visakhapatnam.
R-13: K. Srilatha, W/o. Murali Rao, J-4, Sri Sai Surya Reddy, Rana Pratap Nagar, Near Siri Enclave, Marripalem, Visakhapatnam.

Take notice that the above named petitioner filed the above I.P. against the respondents to declare her as insolvency person under Section 10 of Provincial Insolvency Act and the matter stands posted to **18-11-2024** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **18-11-2024** at **10:30 A.M** in the above Court, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
K. MADHUSUDHANA RAO, Advocate
Visakhapatnam, Cell: 9989012912.

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 163/2015 in O.S. 699/2014

బిట్వీన్
1. పటువర్ధనం శ్రీనివాసరావు (లేటు),
2. పటువర్ధనం షర్మిళ, 3. పటువర్ధనం భరత్
4. పటువర్ధనం వినయ్ ...డిక్రీ హోల్డర్స్
మరియు
శ్రీమతి బొండ నాగకామేశ్వరి..జడ్జిమెంటు డెటారు

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టునిమిత్తం పై జడ్జిమెంటు డెటారు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తి **తేది.26-11-2024** వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం **తేది. 26-11-2024న ఉ॥గం॥ 10.30 ని॥లనుండి సా॥గం॥5.00** మధ్యసమయంలో వేలంవేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు పైతేదిన పైతెలిపిన శ్రీకోర్టువారిఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందు మూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరము: విశాఖపట్నం జిల్లా, జి.వి.యం.సి. పరిధి, మద్దిలపాలెం గ్రామము హౌసింగ్ బోర్డుకాలనీ ఏరియాలో ఉన్నటువంటిన్ని సర్వే నెం. 1/పి, 12/పి, 13, 14 మరియు 17 రులో చేరిన ప్లాట్ నెం. యల్.ఐ.జి-86రు 166.67చ॥గ॥లు లేక 139.47చ॥మీ॥ల స్థలం అందలి డోర్ నెం. 55-16-12 అసెస్‌మెంటు నెం. 42946రు కలిగిన 700 చ॥అ॥లు విస్తీర్ణం కలిగిన ఆర్.సి.సి. బిల్డింగ్‌కు హద్దులు. **తూర్పు:** యం.ఐ.జి హౌస్ నెం.51 మరియు 52, **దక్షిణం:** యల్.ఐ.జి. హౌస్ నెం. 87, **పడమర:** 30అ॥లు వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం:** యల్.ఐ.జి-85.

DHR Value : Rs. 15,00,000/-
Amin Value : Rs. 36,20,000/-
JDR Value : Not furnished

(By Order of the Hon'ble Court)
BEVARA SATYANARAYANA, Advocate
#48-5-52, Sri Nagar, VSP. **Cell: 94405 27406**

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి. అండ్ యస్.టి) వారి కోర్టు, శ్రీకాకుళం
ఐ.ఎ.274/2024 ఓ.ఎస్.50/2021

1) మర్రాపు లీలా మోహన్
2) భవిరిపూడి శ్రీరామమూర్తి నాయుడు
.......పిటిషనర్లు/వాదులు

మరియు :
రెడ్డి అప్పల నాయుడు వగైరాలు
.......రెస్పాండెంట్లు/ప్రతివాదులు

3వ రెస్పాండెంట్/ప్రతివాది :
రెడ్డి సురేష్ కుమార్, వయస్సు 50 సం॥లు, తండ్రి అప్పలనాయుడు, నివాసము : లా కాలేజి రోడ్డు, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో వాదులు అయిన మర్రాపు లీలామోహన్ వగైరా మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి. అండ్ యస్.టి) వారి కోర్టు, శ్రీకాకుళంలో దాఖలు చేసిన దావా ఓ.యస్. నెం.50/2021 నెంబరు దావాలో మీరు 3వ రెస్పాండెంట్/ప్రతివాదియై ఉన్నారు. సదరు దావాలో నోటీసులు జారీ కాబడినప్పటికి మీరు నేటి వరకు హాజరు కానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయంపించి యున్నారు. మీ తండ్రి గారు అనగా 1వ ప్రతివాది ఈ దరిమిలా కాలము చేసినందున మీ తండ్రి గారి వారసులను చేర్పించుటకు వేసిన పిటిషన్‌లో కూడా పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయంపించి యున్నారు. సదరు దావా **తే.25.11.2024** నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలోనున్నూ, అందలి వారసులును చేర్చమని దాఖలైన పిటిషన్‌లో మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్‌మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహా పై వాయిదా తేదీన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదిన హాజరు కాకుండ తప్పి పోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ, ఏడ్వోకేట్,
బొబ్బిలి, విజయనగరం జిల్లా.
సెల్ నెం. 9440592366

ప్రజా పోరాటంగా ఉక్కు ఉద్యమం

వామపక్ష పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

నినదిస్తున్న వామపక్ష, ప్రజా కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాన్ని కార్మికులకే పరిమితం చేయకుండా, ప్రజాపోరాటంగా మార్చి జాతీయ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో వామపక్ష పార్టీలు, కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కంటే తర్వాతే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ముప్పు పెరిగిందని, దీనిపై అంతకుముందు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌పై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7న విజయవాడలో వామపక్ష పార్టీల సమావేశంలో విశాఖ ఉక్కు ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో పతాక స్థాయికి తీసుకెళ్లడంపై చర్చిస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సహకారానికి సిద్ధమౌతున్న రాష్ట్ర ప్రభుత్వం.. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణను విస్మరించడాన్ని తప్పుబట్టారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నష్టాలను సాకుగా చూపి విశాఖ ఉక్కును మూసేయాలన్న కేంద్ర కుయుక్తులపై అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో ప్రధాని మోడీని కలిసినా మాట్లాడలేదని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఆర్థికంగా దెబ్బతీసేందుకు యాజమాన్యం కుట్రలు పన్నుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపుతామన్న గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్ స్పందించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.. విశాఖ స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ 1358 రోజులుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం జరుగుతున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు.

సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎవి.వర్మరాజు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, సిపిఐ ఎంఎల్ ఎన్‌డి జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, సిపిఐ ఎంఎల్ నాయకులు ఆడారి అప్పారావు, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకులు కె.దేవా, ఎంసిపిఐయు నాయకులు కె.శంకరరావు, ప్రజా, మహిళా, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : దీపావళి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. ఇంట్లో దీపాలు వెలిగిస్తుండగా, ప్రమాదవశాత్తు కర్టెన్‌కు దాని నుంచి చీరకు నిప్పంటుకుని మంటలు రాజుకోవడంతో దార్లపూడి సూర్యకుమారి (93) దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తాటిచెట్లపాలెం వద్ద నివాసముంటున్న దార్లపూడి సూర్యకుమారి అనే వృద్ధురాలు గురువారం రాత్రి దీపావళి సందర్భంగా ఇంట్లో దీపాలు వెలిగిస్తుండగా కర్టన్స్‌కు మంటలు తగిలి, వాటిని ఆర్పే ప్రయత్నంలో చీరకు తగలడంతో కాలిపోయింది. ప్రమాదంలో తీవ్ర కాలిన గాయాలైన సూర్యకుమారిని దొండపర్తిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు అక్కడ చికిత్స పొందుతూ మృత్యువాత పడిందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. ఒడిశాకు చెందిన గంగాధర్ (48) హెటిరో కంపెనీలో పని చేస్తూ నక్కపల్లి రెల్లి కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి తన బైక్‌పై ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్దకు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను విశాఖ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి శ్రీను తెలిపారు.

10 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: పది కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఏఎల్ పురం చెరకు కాటా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు బైకుల్లో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. జీ.మాడుగుల మండలానికి చెందిన కొండపల్లి లక్ష్మణరావు, కొండపల్లి చంద్రశేఖర్‌లను అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాయీ బ్రాహ్మణునికి పదవిపై హర్షం

ప్రజాశక్తి- వేపగుంట : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో సభ్యునిగా కుప్పం నియోజకవర్గానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు వైద్యం శాంతారామ్ స్థానం కల్పించడంపై విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు నరవ పైడిరాజు హర్షం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఇతర టిడిపి ముఖ్యనేతలకు ధన్యవాదాలు తెలిపారు. మిగతా దేవాలయాల కమిటీలు, కార్పొరేషన్లలో నాయీ బ్రాహ్మణులకు మరింత ప్రాధాన్యతనివ్వాలని కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ నిధులతో పలు రహదారి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఒక్కటొక్కటిగా ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే రూ.30లక్షలతో ఆకుల వారి కల్లాల నుండి గొట్టుపల్లి కల్లాల వరకు, అలాగే దొంతల వారి కల్లాలు రోడ్డును రూ.10 లక్షలతో తారురోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామని ఎమ్మెల్యే గంటా స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జానకి, తహశీల్దార్ పేర్లి శ్యామ్ ప్రసాద్, నేతలు సందీప్ పంచకర్ల, కోరాడ .రాజబాబు, సర్పంచులు కోన పైడిరాజు, చందక లక్ష్మి, నాయకులు, బంటుపల్లి శ్రీను, కోన శ్రీను, షినగం పెద్ద రామారావు తదితరులు పాల్గొన్నారు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి -పద్మనాభం : రానున్న వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసమైన అన్ని చర్యలు ఇప్పటినుంచే చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ పి.ఈశ్వరభాయి తెలిపారు.వచ్చే వేసవి దృష్టిలో పెట్టుకొని మండలంలోని పలు గ్రామాల్లో రూ.16.98 లక్షలతో 90 పనులు ప్రతిపాదించగా, వాటిలో 41 పనులు పూర్తయ్యాయని, వివిధ దశల్లో ఉన్న మిగతా 28పనులను అతిత్వరలో పూర్తిచేస్తామన్నారు.

ఎబిసి ఫ్రీడం కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవితేజ

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం సమకూరుతాయని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు, అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ (ఎబిసి) గౌరవాధ్యక్షులు గంటా రవి తేజ అన్నారు. శుక్రవారం స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఫ్రీడం కప్-2024 క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేడున్న యాంత్రిక జీవనంలో మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రతి ఒక్కరికీ క్రీడలనేవి ఎంతో అవసరమన్నారు. ఎబిసి వ్యవస్థాపకులు శైలేంద్రరెడ్డి టోర్నమెంట్‌ను నిర్వహిస్తు ఒడడం అభినందనీయమన్నారు.

ఎబిసి అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, టోర్నీలో 14 జట్లు పాల్గొంటున్నాయని, డిసెంబర్ 1న ఫైనల్స్ ఉంటుం దన్నారు. ఎబిసి కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్ మాట్లాడుతూ, భీమిలి జోన్‌లోని నాలుగు వార్డుల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 6,7,8 తరగతుల విద్యార్థులను ఎబిసిలో చేర్పించి టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, ఎబిసి ఉపాధ్యక్షులు చిన్నారావు, సహాయ కార్యదర్శి అడిదం అంజనీకుమార్, ఎ.లోవరాజు, మొకర నరసింగరావు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్లు

పింఛన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

సిర్లపాలెంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలో ఉదయాన్నే పింఛన్లు అందుకుందామని ఎంతో ఆశగా వచ్చిన వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులు పింఛన్ల పంపిణీ సర్వర్లు మొరాయించడంతో మధ్యాహ్నం వరకు పడిగాపులు పడక తప్పలేదు. ఉదయం నుంచి మొరాయించిన సర్వర్లు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పని చేయడంతో సిబ్బంది పింఛన్లు అందజేశారు. దీంతో మండలంలో 93 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపిడిఒ వి.జానకి తెలిపారు.

మండలంలో 26 పంచాయతీలలో 8765 మందికి పొద్దుపోయే వరకు సచివాలయ సిబ్బంది పింఛను అందజేశారు. ఉదయానికే చేరుకున్న లబ్ధిదారులు గంటల తరబడి వేచియుండడంతో పలువురు అసహనానికి గురయ్యారు.

అమరజీవిని మరిచారా..?

- పత్తా లేని పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రభుత్వం, నేతలు, అధికారులు మరిచిపోయారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏటా నవంబర్ ఒకటో తేదీన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు, దేశభక్తిని స్మరించుకుని నివాళులర్పించడం కొన్నాళ్లుగా సాంప్రదాయంగా కొనసాగుతుండేది. అయితే ఈ ఏడాది నవంబర్ ఒకటిన ప్రస్తుతం అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ జాతీయ, రాష్ట్ర నాయకుల సేవలను మరిచిపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలర్పించే పొట్టి శ్రీరాములు జయంతి వేడుకను ఆనందపురం మండలంలో ఎక్కడా జరుపుకోక పోవడం సిగ్గుచేటని పలువురు వాపోతున్నారు. అమరులైన నేతల సేవలకు గుర్తింపునివ్వాలని కోరుతున్నారు.

మురుగు కాలువ మరమ్మతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ, జైభీమ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన ప్రధాన కాలువ మరమ్మతు పనులను కెల్ల సునీత సత్యనారాయణ దగ్గరుండి చేయించారు. కాలువ పాడై, మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలిసిన కార్పొరేటర్ సునీత సమస్యను జోనల్ కమిషనర్ దృష్టికి తేగా వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - ఆరిలోవ :ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాలతో కొండవాలు ప్రాంతం బిఎన్‌ఆర్ నగర్‌లో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. టిడిపి సీనియర్ నాయకులు బలగం సుధాకర్, కేతా సత్యనారాయణ, కొండమ్మ, రామచద్రరావు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు గోపాలపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. తాళాలు వేసిన కార్యాలయం నుంచి పొగలు వస్తుండడంతో ఆందోళనకు గురైన విషయం తెలిసిన జనసేన వార్డు అధ్యక్షుడు నాయుడు, స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఈ స్కూటీ ఎవరిదో ?

బిఆర్‌టిఎస్ రోడ్డులో 20రోజులుగా ఉన్న స్కూటీ

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రహదారిని ఆనుకొని పెదగదిలి అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో ఎపి 30డిఎస్ 9018 నెంబరుగల స్కూటీ గత 20 రోజులుగా పార్కింగ్ చేసి ఉంది.ఈ ద్విచక్రవాహనం హ్యాండిల్ లాక్ వేయకుండా ఉంది. ఈ విషయాన్ని పోలీసు నేర విభాగం పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : విఘ్నేశ్వర అయ్యప్ప సేవాపీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శుక్రవారం శ్రీకాంత్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రారంభించారు. ఎయు విశ్రాంతి ప్రొఫెసర్ నరసింహ దేవర రామకృష్ణ, తదితరుల ఆర్థిక సాయంతో ఈనెల 27 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 200 మందికి అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

వరద బాధితులకు ఆర్థిక సాయం



చంద్రబాబుకు సాయం చెక్కు అందజేస్తున్న బిసి సంఘం నేతలు

ప్రజాశక్తి- ఆనందపురం: విజయవాడ వరద బాధితులకు బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.పది లక్షల ఆర్థిక సాయాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్ని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అందజేశారు. ఈసందర్భంగా బిసి కులాల జనగణన, చట్ట సభలలో బిసిలకు 33 శాతం, స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్ అమలు, బిసిలకు ప్రత్యేక చట్టం, బిసి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, బిసి హాస్టళ్లకు కొత్త భవనాలు, మెరుగైన సౌకర్యాలను కల్పన వంటి బిసి కులాల సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, యువజన అధ్యక్షులు కుమ్మరి క్రాంతికుమార్, జాతీయ అధ్యక్షులు కాజుల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

విజయవంతంగా గ్రహణం మొర్రి చికిత్స

ఆపరేషన్ చేయించుకున్న చిన్నారి

ప్రజాశక్తి- మధురవాడ : గ్రహణం మొర్రి సమస్యతో జన్మించిన నగరానికి చెందిన తొమ్మిది నెలల చిన్నారికి గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి వైద్య నిపుణులు నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. దంత కళాశాల ఆసుపత్రి ఓరల్ మాక్సియో ఫేషియల్ సర్జరీ విభాగం వైద్యులు డాక్టర్ ఎమ్.సతీష్, డాక్టర్ వివేక్ మనోహర్ ఈ అరుదైన ఆపరేషన్ చేశారు.. పుట్టిన పిల్లల్లో ప్రతి వెయ్యి మందిలో 1.09 శాతం మంది గ్రహణం మొర్రి సమస్యను కలిగి ఉంటారని, వారికి ప్రారంభంలోనే శస్త్ర చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చునన్నారు. గ్రహణం మొర్రితో జన్మించిన పిల్లలు మానసికంగా ఆత్మనూన్యతకు గురి కాకుండా వైద్యులను సంప్రదించి చికిత్స చేయిస్తే, అందరిలా జీవితాన్ని గడిపే అవకాశం ఉందన్నారు. దంత వైద్యంలో ఓరల్ మాక్సియో ఫేషియల్ సర్జరీ విభాగం నిపుణులు గీతంలో ఈ తరహా శస్త్ర చికిత్సలు నిర్వహణలో నేర్పు సాధించారని తెలిపారు.

సిఎం చంద్రబాబుకు సాదర స్వాగతం

చంద్రబాబును స్వాగతిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పర్యటనకు విచ్చేసిన తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబును విశాఖ విమానాశ్రయంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు నేతలు, అధికారులు సాదరస్వాగతం పలికారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి శ్రీకాకుళం పర్యటనకు సిఎం చంద్రబాబు వెళ్లారు.

టిటిడి పాలకమండలిలో రాష్ట్రేతరులు అవసరమా?

ప్రజాశక్తి- మాధవధార : కోట్లాది మంది ఆంధ్రా భక్తులకు, ప్రత్యేకించి సంప్రదాయవాదులున్నప్పటికీ, టిటిడి పాలకమండలిలో రాష్ట్రేతరులకు స్థానం కల్పించాల్సి అవసరం ఏముందని ఎపిసిసి ప్రధాన కార్యదర్శి, ఒబిసి రాష్ట్ర ఇన్‌ఛార్జి మూల వెంకటరావు ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన టిటిడి పాలకమండలిలోని 24 మందిలో సగం మంది రాష్ట్రేతరులేనని ఆవేదన వెలిబుచ్చారు. గత పాలక మండలిలో ఉన్నవారికి మళ్లీ అవకాశమిచ్చారని, ఇతర రాష్ట్రాలకు ప్రాధాన్యతనివ్వడం సముచితం కాదన్నారు. రాష్ట్రంలో ఒక్కో జిల్లా నుంచి ఒకరికి స్థానం కల్పిస్తూ 26మందితో పాలకమండలి ఏర్పాటు చేసినా బాగుండేదన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పునరాలోచించాలన్నారు.

అభిజిత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిందే..

- లే ఆఫ్ ఎత్తివేయకుంటే సెజ్ ప్రధాన కార్యాలయం ఎదుటే వంటావార్పు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- కూర్మన్నపాలెం నుంచి పాదయాత్ర - వి సెజ్ లో భారీ ధర్నా

డెవలప్‌మెంట్ కమిషనర్(లేబర్)కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, అభిజిత్ కార్మికులు

ప్రజాశక్తి- గాజువాక : అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ ఫెర్రో టెక్ కార్మికుల సమస్యలను 20 రోజుల్లో పరిష్కరించకుంటే వి సెజ్ ప్రధాన కార్యాలయం ఎదుటే వంటా వార్పు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం హెచ్చరించారు. అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ అక్రమంగా లే ఆఫ్ ప్రకటించడాన్ని నిరసిస్తూ, తక్షణమే ఆ కంపెనీని తెరవాలని డిమాండ్ చేస్తూ దువ్వాడలోని వి సెజ్ కార్యాలయం ఎదుట కార్మికులు శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. తొలుత వారంతా కూర్మన్నపాలెం నుంచి పాదయాత్ర చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ పెద్దపెట్టున నినదించారు. ధర్నానుద్దేశించి లోకనాథం మాట్లాడుతూ పరిశ్రమల నిర్మాణం కోసం భూములు, ఇళ్లను త్యాగం చేసిన వారి పొట్టకొట్టొద్దని అన్నారు. కార్మికులకు కనీస సమాచారం ఇవ్వకుండా కంపెనీని మూసివేయడం చట్టవిరుద్ధమన్నారు. కంపెనీ లే ఆఫ్ ప్రకటించి 20 రోజులవుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించక పోవడం దారుణమన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే అభిజిత్ కంపెనీ యాజమాన్యంతో తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. కార్మికుల పట్ల, కార్మిక చట్టాల అమలులో అత్యంత నిర్లక్ష్యంగా కంపెనీ వ్యవహరించిందని తెలిపారు. ఇంతవరకు కార్మికులు చేపట్టిన శాంతియుత ఆందోళనలు రానున్న కాలంలో ఉధృత రూపం తీసుకుంటాయని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కరోనా సమయంలోనూ బలవంతంగా విధులకు రప్పించి, కార్మికులతో పనిచేయించుకున్న యాజమాన్యం, వారికి సక్రమ వేతనాల చెల్లింపు, ఇతర సమస్యలపై నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ప్రతినెలా 5వ తేదీన చెల్లిస్తామన్న జీతాలు నెలాఖరు వరకు ఇవ్వని పరిస్థితులున్నాయని, దసరా బోనస్‌ను ఎగ్గొట్టేసి 800 మంది కార్మికుల జీవితాలతో ఆటలాడుకున్నారన్నారు. సిఐటియు ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ అక్రమ లేఆఫ్ ప్రకటించిన అభిజిత్ కంపెనీని వెంటనే తెరవాలని, కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని, వారికి పూర్తి వేతనాలు, దసరా బోనస్ చెల్లించాలన్నారు.

కూర్మన్నపాలెం నుంచి పాదయాత్ర

కంపెనీని తెరిచి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అభిజిత్ ఫెర్రోటెక్ కార్మికులు శుక్రవారం కూర్మన్నపాలెం నుంచి వి సెజ్ వరకూ పాదయాత్ర చేపట్టారు. సెజ్ పరిపాలనా విభాగం దగ్గరకు వెళ్లడానికి కార్మికులు ప్రయత్నించగా, దువ్వాడ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది గేటును మూసేసి అడ్డుకున్నారు. కార్మికులతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా సిఐటియు నాయకులు ఎంతచెప్పినా వినకపోవడంతో ఒక్కసారిగా కార్మికులు గేటును తోసేసి పరిపాలన విభాగం వద్దకు చేరుకున్నారు. అక్కడ ధర్నా నిర్వహించారు. సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ (లేబర్) ఎం.రమ్య అక్కడకు వచ్చి అభిజిత్ కంపెనీకి ఇప్పటికే షోకాజ్ నోటీస్ జారీ చేశామని అన్నారు. కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బకాయి పడ్డ జీతాలతోపాటు చట్టపరంగా రావాల్సినవన్నీ చెల్లిస్తామన్నారు. కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, అచ్యుతాపురం మండల కార్యదర్శి కె.సోమునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు వి.వి.రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

గ్రోత్ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దుతాం : కలెక్టర్

ఉచిత గ్యాస్ అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- గాజువాక:ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో విశాఖ మహానగరాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు.. శుక్రవారం గాజువాక కణితి మార్కెట్ రోడ్డులోఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమంలో మాట్లాడుతూ దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్‌తో పేదల ఇళ్లల్లో కొత్త వెలుగులు వస్తాయని, మహిళలకు సాంత్వన చేకూరుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించిన ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, స్టీల్ ప్లాంటు విషయంలో అనుసరించే విధానాలపై కలెక్టర్ స్పందించారు. జిఒ 301పై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామని, ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అర్హులైన లబ్దిదారులకు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఎస్ఒ కె.భాస్కరరావు గ్యాస్‌సిలిండర్లను అందజేశారు.

నేడు సాయిబాబా సంస్మరణ సభ

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : మానవహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబా సంస్మరణ సభ ఈనెల 2న శనివారం ఉదయం 10గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలా) విశాఖ జిల్లా కమిటీ ప్రకటనలో తెలిపింది. ఐలా విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు అల్లు సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు హరగోపాల్, బాబీ వర్ధన్, విశాఖ జిల్లా బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెవరా సత్యనారాయణ, దంత నరేష్ కుమార్, ఐలా రాష్ట్ర కమిటీ సభ్యులు మహ్మద్ ఇక్బాల్ పాల్గొంటారని, న్యాయ వాదులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిరుపేద యువతి వైద్యానికి సాయం

సాయం చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సుందరమ్మ రామన్న చెట్టి (ఎస్ఆర్‌సి) వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ చెట్టి అశోక్ చక్రవర్తి, సభ్యులు ఎం చెట్టి సింహాచలం తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జివిఎంసి మూడో వార్డు ఎగువ పేటకు చెందిన నిరుపేద యువతి ఎం రాణికి మెరుగైన వైద్యం కోసం ఆమె తండ్రి శ్రీనివాసరావుకు ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేలు సాయం చెక్కును అందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ కౌన్సిలర్ సిహెచ్ రమణ, కొక్కిరి అప్పన్న, కె నాగరాజు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రిని పిపిపికి అప్పగిస్తే ఊరుకోం

- సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్
- 31వ రోజుకు చేరిన దీక్షలు

దీక్షల్లో కూర్చున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోర్టు ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరసనలు 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోర్టు కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనానికే రూ.222.43 కోట్లతో పిపిపి పద్ధతిలో పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని 300 పడకల స్థాయికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్న కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రతిపాదన ఒట్టి బూటకమన్నారు. పోర్టులోని సుమారు 4000 మంది ఉద్యోగులు, అధికారులు, కార్మికులు, వారి కుటుంబాలతోపాటు 13వేల మంది పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్యాన్ని దూరం చేసేందుకు కేంద్రం కుట్రపన్నుతోందన్నారు. ఇప్పటికే పిపిపి పద్ధతిలో నడిచిన గంగవరం పోర్టు, వైజాగ్ పోర్టుల్లో బెర్త్‌లు విఫలమైనట్లు పేర్కొన్న కాగ్ నివేదిక దీనికి నిదర్శనమన్నారు. లాభాల్లో ఉన్న పోర్టు ఆస్తులను పిపిపి పేరుతో గంపగుత్తగా ప్రయివేటుకు కట్టబెట్టాలని కేంద్రం యోచిస్తోందన్నారు.

పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, అవసరమైన స్పెషలిస్ట్ వైద్యులు, నాణ్యమైన మందులు సమకూర్చి, పోర్టు ఆసుపత్రిని జవాబుదారీగా నిర్వహించాలని కోరారు. పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుకు అప్పగించే చర్యలకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని, ఉద్యమాలు చేసి కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు , బి లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, సిహెచ్ త్రినాధరావు, కెఎస్ కుమార్, శంకర్రావు, గణేష్, రాము, నరసింహమూర్తి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బహుమతులు అందించిన దృశ్యం

నేవీ మెయిన్ రోడ్డు అధ్వానంపై రాస్తారోకో

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని నేవీ మెయిన్ గేట్ నుండి వెంకటాపురం వద్ద అధ్వానంగా ఉన్న రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 నుండి 9 గంటల వరకు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఈ మార్గంలో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నేవీ నిర్మాణ పనుల నిమిత్తం వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల ప్రధాన రహదారి పెద్ద పెద్ద గుంతల పడి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. అలాగే దుమ్ము ధూళి వలన విధులకు వెళుతున్న ఉద్యోగులు, కార్మికులతో పాటు రోడ్డుకి ఇరువైపులా ఉండే వ్యాపారస్తులు, అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల రూపాయలతో నేవీ నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వాలు, కేవలం రూ.10 కోట్లు ఖర్చుపెట్టి 12 కిలోమీటర్లు రోడ్డును నిర్మించకపోవడం దారుణమన్నారు. రోడ్డుపై ఉన్న గోతుల వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోవడం, కాళ్లు, చేతులు విరిగిపోయి వారి కుటుంబాలకు దిక్కు ముక్కు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నేవీ యాజమాన్యం, ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు గుంతలు పూడ్చాలని, దుమ్ము ధూళి ఎగరకుండా నీటితో తడపాలని కోరారు. ఈ సమస్యను 15 రోజుల్లో పరిష్కరించకపోతే బాధిత గ్రామాల ప్రజలు, కార్మికులు, సమీకరించి, పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అల్లూరి ప్రజాసంఘాల అధ్యక్షుడు బి అప్పారావు, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగరాజు, సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, ఆటో, ముఠా, కొబ్బరి ఒలుపు, భవన నిర్మాణ కార్మికులు, షాపు యజమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేస్తున్న స్థానికులు, నిలిచిపోయిన వాహనాలు

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్ కన్యకాపరమేశ్వరి దేవాలయ జంక్షన్ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరము పట్టణంలోని హైస్కూల్ విద్యార్థులకు ఆంధ్రరాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు పాత్ర అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన తొమ్మిది మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల క్రిష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వర రావు, పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన

ప్రజాశక్తి-యలమంచిలి : కొత్తగా అమలౌతున్న చట్టాల మార్పుల్లో భాగంగా అమలు విధి విధానాలను కింది స్థాయిలో పరిశీలించడానికి యలమంచిలి సబ్జైలును శుక్రవారం జిల్లా ఉచిత న్యాయ సేవా సాధికారసంస్థ కార్యదర్శి ఎం వెంకట శేషమ్మ సందర్శించారు. సబ్జైలు రికార్డులు పరిశీలించి ఖైదీల వివరాలు తెలుసు కున్నారు. బెయిలు సౌకర్యం లేకుండా జైళ్లలో మగ్గుతున్న ఖైదీలు పట్ల ప్రభుత్వం ఉదారత ప్రకటిస్తూ రూ.40 వేలు పూచీకత్తుతో బెయిలు లభించే వీలున్న వారిని ఆ బెయిలు ధరావత్తు లేకుండానే బెయిలు మంజూరు చేసే అవకాశమున్నట్లు ఆమె తెలిపారు.

అనకాపల్లి : అనకాపల్లి సబ్ జైలును శుక్రవారం డిఎల్ఎస్ఎ సెక్రెటరీ వెంకట శేషమ్మ పరిశీలించారు. నిందితులతో మాట్లాడి జైల్లో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. జైల్ అధికారులతో లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటుపై ప్రశ్నించారు. జువెనల్ నేరస్తులు ఎవరు ఉంటే వెంటనే సంబంధిత జైల్కు పంపాలన్నారు. ఆహార మెను వివరాలను పరిశీలించారు. జైల్ పరిసరాల్లో అపరిశుభ్రతను త్వరగా తొలగించాలని అధికారులకు సూచించారు. న్యాయ సహాయకులు సాయిరాం, ఎంఎల్ఎస్సి ప్రతినిధి సత్యనారాయణ, జైల్ సూపరింటెండెంట్ కిరణ్కుమార్ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట విశ్రాంతి ఉద్యోగుల భవనంలో శుక్రవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ దిలీప్ కుమార్ రాజా, డాక్టర్ పల్లవి దంత పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణ, కానూరు గోపాలరావు, ఏ.కామేశ్వరరావు, నంబారమణ, గవేదుల వెంకట శాస్త్రి పాల్గొన్నారు.

అంతర్జాతీయ డాడ్జ్ బాల్ పోటీలకు మినర్వా విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మినర్వా స్కూల్కి చెందిన పదో తరగతి విద్యార్థి పైల హేమ్ ప్రకాష్ అంతర్జాతీయ డాడ్జ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పైల పైడం నాయుడు తెలిపారు. ఆగస్టు నెల 25న తెనాలి చిలుమూరు శ్రీరామ్ రూరల్ స్కూలులో జరిగిన డాడ్జ్ బాల్ పోటీలో అండర్ -21 విభాగంలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 27నుండి 31 వరకు చండీఘర్లో ఇండియా టీంకు డాడ్జ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మలేషియాలో ఈ నెల 2 నుండి 5 వరకు జరుగుతున్న అంతర్జాతీయ పోటీల్లో హేమ్ ప్రకాష్ పాల్గొని ఆడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హేమ్ ప్రకాష్ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మూల కొత్తూరు గ్రామంలో హెరిటేజ్ నూతన పాల సేకరణ కేంద్రాన్ని ఆ కంపెనీ మేనేజర్ కూంద్రపు శేష శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలో పాలు సరఫరా చేసిన రైతులకు అధిక ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జి.గోవిందు, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, యు.కోటేశ్వర్, త్రినాథ్, అప్పలనాయుడు, సన్యాసిరావు, జోగినాయుడు, దేవుడు, సత్తిబాబు, ఏడుకొండలు, అచ్చిబాబు పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతో అభిజిత్ కార్మికుల భిక్షాటన

ఖాళీ ప్లేట్లతో భిక్షాటన చేస్తున్న అభిజిత్ కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ పరిశ్రమ యాజమాన్యం తమకు జీతాలు, బోనస్లు చెల్లించాలని, లే ఆఫ్ ఎత్తివేసి పరిశ్రమను తెరవాలని కోరుతూ అభిజిత్ కార్మికులు ఖాళీ ప్లేట్లు చేతపట్టుకుని అచ్యుతాపురంలో గురువారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు అందక, బోనస్ చెల్లించక దసరా, దీపావళి, నాగుల చవితి పండగలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పండగలలో ఆనందంతో కుటుంబమంతా గడపాల్సిన కార్మికులు ఆర్థికంగా చేతిలో చిల్లి గవ్వలేక భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. అభిజిత్ పరిశ్రమ లే ఆఫ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని అధికారులను పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా పరిశ్రమను లే ఆఫ్ ప్రకటించడం అన్యాయమన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వాలు 1000 మంది కుటుంబాలు వీధిని పడిన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిబంధనలు పాటించని కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, పరిశ్రమ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోము నాయుడు, అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

ఫార్మా, ఎన్టిపిసి కాలుష్య గ్రామాలను తరలించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఫార్మాసిటీ కంపెనీల తీవ్ర కాలుష్యానికి గురి కాబడుతున్న తాడి గ్రామాన్ని, ఎన్టిపిసి కాలుష్యంతో అల్లాడుతున్న మూల స్వయంవరం, సోమనాయుడుపాలెం గ్రామాలను తరలించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మా ఎన్టిపిసి కాలుష్యాలతో కిడ్నీ, చర్మం, ఊపిరితిత్తులు, గుండె, శ్వాస, క్యాన్సర్ వంటి జబ్బులతో ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాలు తరలించడానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఇప్పటికే తీవ్ర కాలుష్యాన్ని గుర్తినట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నివేదిక సిద్ధం చేసి ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఫార్మా పరిశ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్థ రసాయన జలాలను రాంకీ యజమాన్యం శుద్ధి చేయకుండా విడిచిపెట్టడంతో మల్లోడు గెడ్డ, ఊర చెరువు, పెద్ద చెరువు, సన్యాసి చెరువు తీవ్ర కాలుష్యంతో దుర్గంధం వెలువడుతున్నాయని తెలిపారు.

ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం, మెగా రక్తదాన శిబిరాన్ని ఎబి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ డాక్టర్ ఎం.ఎస్.శాంతి స్వరూప్ మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారితో కలిసి ప్రారంభించారు. అందరికీ వైద్యం అందించడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ (ఎంవిపి), అనిలజ్ నీరుకొండ ఆస్పిటల్ (సంగివలస), వందే భారత్ బ్లడ్ సెంటర్ (గాజువాక) డాక్టర్ల సహకారంతో ఈ శిబిరాలు నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ పార్టీ భీమ్ఆర్మీ వి.ఇంద్రశేఖర్ బ్లడ్ బ్యాంక్ విభాగాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో 413 మంది రోగులకు మందులు అందించినట్లు, రక్తదాన శిబిరంలో 52 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అతిథి అధ్యాపకుని కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి రసాయన శాస్త్రం అతిథి అధ్యాపకుని పోస్ట్ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రం పీజీ కోర్సులో 55శాతం కలిగి ఉండి, యూజీసీ ఎన్ఇటి, స్టేట్ ఎస్ఎల్ఇటి, పిహెచ్డి, అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ లోగా దరఖాస్తును ఆఫీసులో అందజేయాలని, 6న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీమంగమ్మని సంప్రదించాలని కోరారు.

దట్టంగా కురుస్తున్న పొగ మంచు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గత రెండు రోజులుగా పొగ మంచు దట్టంగా కురుస్తుంది. దీంతో ప్రకృతి ప్రేమికులు మంచు సోయగాలను ఆస్వాదిస్తున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుండి మంచు కురుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు ముసుగులు వేసుకుని వెళ్తున్నారు. పొగ మంచు కూరగాయల సాగుపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కశింకోట : గ్రామాలు అభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అనకాపల్లి శాసన సభ్యులు కొణతల రామకృష్ణ అన్నారు. మండలంలోని త్యేగాడ, కొత్తపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, పొన్నగంటి అప్పారావు, ఉల్లింగల రమేష్, వేగి రామకోటి, సిదిరెడ్డి శ్రీను, మాజీ సర్పంచ్ సిదిరెడ్డి సూర్య నారాయణ, ఎస్.కె.బాబర్, అద్దేపల్లి బాబురావు, బుదిరెడ్డి గంగయ్య, తిర్రి చిరంజీవి, బుదిరెడ్డి అప్పడు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం గొబ్బూరు గ్రామంలో రామ్కో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సాంబమూర్తి 200 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్కో హెచ్ఆర్ రవి కుమార్, గ్రామ సర్పంచ్ మళ్ళ మణి గోపి, జనసేన నాయకులు మళ్ల వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరవాడలో టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ గ్రామంలో పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు గండి వంశీ, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టిడిపి మండలం అధ్యక్షులు వియ్యపు చిన్న, మాజీ ఎంపీపీ మాసరపు అప్పలనాయుడు, ముత్యాల పాలెం మాజీ సర్పంచ్ చింతాకాయలు ముత్యాలు, ఇందల కొండారావు, పైల రామచంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు మృతి

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మెలిపాక గ్రామానికి చెందిన యువకుడు రెండు రోజులు క్రితం కనిపించకుండా పోగా, శుక్రవారం శారదా నదిలో శవమై తేలాడు. దీనిపై స్థానిక ఎస్సై పి ప్రసాద్రావు అందించిన వివరాలు ప్రకారం.... మెలిపాక గ్రామానికి చెందిన ద్వారపూడి రాకేష్ (21) అక్టోబర్ 30న సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుండి బయటికి వెళ్ళాడు. రాకేష్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లి వరలక్ష్మి ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం చిన్న యాదగిరి పాలెం సమీప శారద నదిలో రాకేష్ శవమై తేలి ఉండటాన్ని గ్రామస్తులు గమనించి అతని తల్లికి సమాచారం అందజేశారు. రాకేష్ తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డాక్టర్ ఆఫ్ ఫార్మసీ సాధించిన పల్లవి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన కర్రి పల్లవి పార్వతి దుర్గభవాని డాక్టర్ ఆ ఫార్మసీ సాధించింది. ఆమె బొబ్బిలిలో గోకుల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్లో డాక్టర్ ఆఫ్ ఫార్మసీలో 1000కి 890 మార్కులు సాధించి సెకండ్ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆమెకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

15లోగా ఉద్యానవన పంటల బీమా చేయించుకోవాలి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-అనకాపల్లి రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్లో ఉద్యానవన పంటలకు బీమా చేసేందుకు నోటిఫై చేస్తుందని, ఈనెల 15 లోగా ఉద్యానవన పంటల రైతులు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లేదా ఆన్లైన్ ద్వారా బీమా న ద ం పా య ం ం పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ రావు తెలిపారు. గత ఏడాది జిల్లాలో 24 మండలాల్లో సుమారు 24 వేల మంది జీడి మామిడి తోటల రైతులు 60 వేల ఎకరాలకు బీమా చేయించుకున్నారని, ఈ ఏడాది సుమారు 70 వేల ఎకరాల్లో సుమారు 25 వేల మంది సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. వాలంటరీ ఎన్రోల్మెంట్ ఎకరాకు రూ.30,800 బీమాలో 16 శాతం ప్రీమియంలో రైతు ఐదు శాతం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదున్నర శాతం చొప్పున కట్టాల్సి ఉంటుందని, ఇందులో రైతు వాటా కేవలం ఎకరాకు రూ.1540 చొప్పున ఎన్ని ఎకరాలకైనా కట్టుకోవచ్చుని తెలిపారు. కౌలు రైతులు సిసిఆర్సి కార్డులు భూమి యజమాని సంతకంతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కౌలుకు చేస్తున్నట్టు గ్రామంలో విచారణ చేసి తమ శాఖ ద్వారా ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు అప్లోడ్ చేయాలన్నారు. క్లయిమ్ సెటిల్మెంటు అధిక గాలి తేమ శాతం, అధిక అకాల వర్షం, అధిక ఉష్ణోగ్రతల ఆధారంగా క్లైమ్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా రైతులు రుణం తీసుకుంటున్నట్టు బ్యాంకు డిక్లరేషన్ ఇస్తుందని, నాన్ లోన్ ఫార్మర్స్ రూ.1540 కడుతూ ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్ మామిడి పంట ఉన్నట్టు హార్టికల్చర్ సర్టిఫికేట్ జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఇతర బ్యాంకులు కూడా ఇందుకు రుణ సదుపాయం కల్పిస్తున్నాయన్నారు. సమగ్ర పంట నిల్వ నిర్వహణ యాజమాన్యం పథకం కింద జిల్లాలో పంట సేకరణ కేంద్రాలు, పంట నిల్వ గిడ్డంగులు, శీతల గిడ్డంగుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పంట సేకరణ కేంద్రాలకు రూ.15 లక్షల యూనిట్‌గా 40శాతం రాయితీపై 40X60 అడుగుల విస్తీర్ణంలో, పంట నిల్వ గిడ్డంగులు నాలుగు లక్షల యూనిట్లో 50శాతం రాయితీ పై 9X6 చదరపు మీటర్ల సైజులోనూ, శీతల గిడ్డంగులు సోలార్ బ్యాకప్, విద్యుత్తు సరఫరా ఆధారంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సోలార్ బ్యాక్అప్ గిడ్డంగుల నిర్మాణానికి 10 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 12 లక్షల 50 వేల యూనిట్ కాస్ట్‌కు రైతు రూ.4,35,500 రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు. కరెంటు గిడ్డంగులకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి రూ.15 లక్షల యూనిట్‌కి గాను రైతుకు రాయితీ కింద రూ.5.25 లక్షలు లభిస్తుందన్నారు. ఇతర వివరాలకు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యానవన శాఖ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు.

జీడి రైతులు బీమా పథకంలో చేరాలి

కె.కోటపాడు : ఈ సంవత్సరం రబీ కాలంలో జీడి తోటలకు ప్రభుత్వం స్వచ్ఛంద బీమా పథకం ప్రవేశపెట్టిందని, ప్రతి జీడి రైతు ఈ పథకంలో చేరాలని స్థానిక ఉద్యానవన శాఖ అధికారి కిరణ్మయి తెలిపారు. మండలంలోని సూదివలస, పాతవలస, మర్రివలస గ్రామాల్లో జీడి మామిడి రైతులతో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఒక ఎకరా జీడి తోటకు రైతు రూ.1540 చెల్లించాలని, ఎన్ని ఎకరాలైనా బీమా చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.30800 చెల్లించడం జరుగుతుందన్నారు. ఈనెల 15వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు.

పింఛన్ల కోసం పడిగాపులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : సర్వరు సక్రమంగా పనిచేయకపోవడంతో శుక్రవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఇబ్బందులు తలెత్తాయి. మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ చేపట్టారు. కొద్ది సమయం పాటు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సాగిన ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు సర్వర్లు మొరాయించాయి. పెన్షన్ల పంపిణీ కోసం లబ్ధిదారుల బయోమెట్రిక్ ఎన్నిసార్లు వేసిన పనిచేయలేదు. మధ్యాహ్నం 11 గంటల నుండి తర్వాత సర్వర్ల పని చేయడంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించారు. పలు గ్రామాల్లో లబ్ధిదారులు పెన్షన్ల కోసం ఎదురుచూపులు చూశారు.

ఇందిరా గాంధీకి నివాళి

ప్రజాశక్తి- కశింకోట : మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 40వ వర్ధంతి వేడుకలు కశింకోటలో శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తెర శ్రీధర్, మాజీ ఎంపీటీసీ కాళ్ళ సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ సేనాపతి ఈశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు సుపథ ప్రతిభా పరీక్షలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలు దేవరాపల్లి ప్రభుత్వం ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 3న ఆదివారం నిర్వహించనున్నట్లు సుపథ సోదర బృందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ప్రాథమిక (1-5 తరగతులు), ప్రాథమికోన్నత (6-8), ఉన్నత (9-10) స్థాయిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని విభాగాలకు అర్హత పరీక్షగా వర్ణమాల ఉంటుందని, వివిధ స్థాయిలలో పద్య పఠనం, శ్లోక పఠనం, సుభద్ర గేయాలు, కృష్ణాష్టకం, వ్యాసరచన పోటీలు నిర్వహించబడతాయని చెప్పారు. అన్ని విభాగాల వారికి కలిపి మద్రామాయణంపై క్విజ్ నిర్వహిస్తామన్నారు. పరీక్షలు ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటాయని, రోజు సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎ.కోడూరు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కె.కోటపాడు : పరుగు పందెం అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని ఏ కోడూరు హైస్కూల్ విద్యార్థిని తర్రా మధుశ్రీ ఎంపికైనట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు తెలిపారు. ఈనెల 3న శ్రీకాకుళంలో జరుగుతున్న 3000 మీటర్ల రన్నింగ్ పోటీల్లో మధుశ్రీ పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని పిడి రమేష్, హైస్కూల్ సిబ్బంది అభినందించారు.

దళితుల శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలోని దళితుల స్మశాన వాటికలో తుప్పలను స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ మాలిబాబు, టీడీపీ నాయకులు సబ్బవరపు శివశంకర్, ఉల్లి చింతాలు, కాటపల్లి అచ్చిబాబు ఆధ్వర్యాన తొలగించి శుభ్రపర్చారు. గతంలో ఆక్రమణకు గురైన స్మశాన వాటికను సర్వే చేసి దళితులకు అప్పగించడంతో అపరిశుభ్రంగా ఉన్న స్మశాన భూమిని శుభ్రం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మకర తోరణాలకు విరాళం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక మంద బయలు సీతారాముల వారి ఆలయానికి మకర తోరణాల ఏర్పాటుకు వైయస్సార్సీపి మాజీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ రూ.25 వేలను గురువారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆడారి సూర్యచంద్ర రామారావు, రమణబాబు, ఆడారి అప్పలనాయుడు, రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శుక్రవారం కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లను దీపావళి పండుగ సందర్భంగా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, టిడిపి నాయకులు కర్రి సాయి కృష్ణ, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, డొక్కా నాగభూషణం, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట విజయ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో హోమ్ అప్లయన్స్ షాపు దగ్ధం

సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం

కాలి బూడిదైన షాపులోని సామగ్రి

ప్రజాశక్తి-అనకాపల్లి అనకాపల్లి పట్టణం బాలాజీరావుపేటలోని కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో వర ఎంటర్ప్రైజెస్ షాపు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం జరిగింది. షాపు యజమాని వరప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం... శుక్రవారం తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో షాపు నుంచి పొగలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ ఇంజన్లతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. పక్క షాపులకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. పండగల సీజన్ కారణంగా షాపు నిర్వాహకుడు వరప్రసాద్ బయట అప్పులు తెచ్చి సుమారు 70 లక్షల రూపాయల పెట్టుబడి పెట్టినట్టు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక అధికారులు తెలిపారు. కాగా ప్రమాద స్థలాన్ని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పరిశీలించారు. షాపుకు బీమా లేకపోవడంతో జరిగిన నష్టాన్ని పూడ్చలేమని అయితే ప్రభుత్వానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం అందేలా ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే రామకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈదులపాక భోనంగి రెవెన్యూ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో గెడ్డలు, చెరువులు, స్మశానాలు, ఇతర ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ ఈ.బోనంగి రెవెన్యూ పరిధి కె.గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన చిప్పాడ రామారావు వినతి పత్రం సమర్పించారు. అలాగే రీ సర్వే చేయాలని, పేర్లు మార్పు తదితర సమస్యలపై 124 మంది రైతులు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు అంబేద్కర్, ఆర్ఐ, విఆర్ఓ, వీఆర్ఏలు, సర్వే అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అయ్యన్న పాలెం పంచాయతీలో శుక్రవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 147 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. అర్జీలపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, విఆర్వో ఎం.గోవిందరావు, సర్పంచ్ బుదిరెడ్ల లక్ష్మి కనకరాజు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని టి నగరపాలెంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ పి రామారావుకు రైతుల ద్వారా 45 దరఖాస్తులు అందాయి. సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, విఆర్ఒ పి వెంకట అప్పారావు, రీసర్వే డిటి లక్ష్మీకుమారి, గ్రామస్తులు చంద్రశేఖర్, పూసర్ల రామారావు పాల్గొన్నారు

పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలసలో టిసర్వే రెవెన్యూ సదస్సును శుక్రవారం తహశీల్దార్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో డిటి సురేష్ నిర్వహించారు. రీసర్వే పూర్తయినా రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని గ్రామ నాయకులు. సారిక శంకరరావు కోరారు. రైతుల వద్ద ఎటువంటి భూవివరాలకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో ఏమీ తెలియని పరిస్థితి ఉందన్నారు.

భూలోకమాంబ పంచరాత్రుల మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలిలో దీపావళి నుండి నాగులు చవితి వరకూ జరిగే భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పంచరాత్రులు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే విజయకుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్, విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి ప్రసాదం, అమ్మవారి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పిళ్లా అశోక్, మళ్ల కొండబాబు, ఆడారి రమణబాబు, ఆదిమూర్తి పాల్గొన్నారు.

చోడవరం సుగర్స్‌ను ఆదుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం నిధులు ఇచ్చే ఆదుకోవాలని, ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన పంచదారను సివిల్ సప్లై ద్వారా కొనుగోలు చేయాలని చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుతో కలిసి చోడవరం చక్కెర ఫ్యాక్టరీ స్థితిగతులను మంత్రికి వివరించారు. చక్కర కర్మాగరాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం తరుపున సహకారాలు అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చినట్లు రాజు తెలిపారు.

చెరుకు తోటల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో చెరుకు తోటలను గోవాడ చక్కెర కర్మాగారం ఏవో ఎస్వి నాగేశ్వరరావు, ఫీల్డ్‌మేన్ వేపాడ శ్రీను తదితరులు శుక్రవారం పరిశీలించారు. రైతులతో సమావేశమై మేలు రకం చెరకు సాగు వలన అధిక దిగుబడిలను సాధించవచ్చుని తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో పేమెంట్లు చెల్లించకపోవడం, చెరకు సాగు గిట్టుబాటు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెప్పారు. ఫీల్డ్ మెన్ చిన్ని హరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రభుత్వ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగతులు ప్రారంభమై నెలలు గడుస్తున్న టెన్త్ క్లాస్కి సోషల్ సబ్జెక్ట్ కి టీచర్ లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీలో ఉన్న కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఛైర్మన్ పువ్వల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి నెలలాగే గురువారం 30 మంది నిరుపేదలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు నిత్యవసర సరుకులు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో రెవ గుంటి అరుణ్ పాల్, బ్రదర్ అనీల్, బ్రదర్ ఇస్సాకు, మ్యాత్యు, దివ్య తేజ, రమ్య, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సుగర్ వ్యాధిపై యోగా తరగతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత్ స్వాభిమాన ట్రస్ట్ అధ్యక్షులు భీశెట్టి దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో జార్జ్ క్లబ్‌లోని పతంజలి యోగ సెంటర్‌లో షుగర్ వ్యాధిపై శిక్షణా తరగతులు ఈ నెల 2 నుండి 6వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులు శిక్షణను అందజేస్తారన్నారు. ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 9848521738, జి. మంగయ్య 9908059080 సంప్రదించాలని కోరారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

నర్సీపట్నంలో గ్యాస్ సిలిండర్‌ను ఇస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రభుత్వరంగ కార్యక్ర మాల్లో, ప్రజలకు సంక్షేమం అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, అధికారుల్లో ఇంకా పాత వాసన బాగా ఉందని, నిర్లిప్తత వీడాలని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. పాయకరావుపేట పంచాయితీ రాజ్ ప్రభుత్వ గెస్ట్ హౌస్ నందు శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ ని ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తాను ఎక్కడ ఉన్నా, ఏ అధికారి ఎలా పని చేస్తున్నారో డేటా ఉంటుందని, సస్పెండ్ చేసే పరిస్థితి రానివ్వకుండా అధికారులు పనిచేయాలన్నారు.త్వరలో పాయకరావుపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు దీపం2 పథకంలో భాగంగా లబ్ధిదారులకు గ్యాస్ కలెక్షన్ పత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలు ఈ పథకం కొనసాగుతుందని తెల్ల రేషన్ కార్డుతో పాటు గ్యాస్ కనెక్షన్ తో పాటు వినియోగంలో ఉన్న గ్యాస్ సిలెండర్ ఉండాలని తెలిపారు.నాలుగు నెలల్లో నర్సీపట్నం నియోజకవర్గానికి రూ. 41 కోట్లు కేటాయింపు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ వీవి రమణ, జడ్పిటిసి సుకల రమణమ్మ , నర్సీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ సూర్య చంద్ర పాల్గొన్నారు.

రావికమతం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోఉచిత గ్యాస్ సిలిండర్లను చోడవరం శాసనసభ్యులు కెయస్ఎన్ఎస్ రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు, వికలాంగులకు రూ.6000 పింఛన్లు పెంచడం జరిగిందన్నారు.గతంలో నాసిరకం మద్యాన్ని అమ్మి ప్రజల జీవితాలతో ఆడుకునే వారన్నారు .ప్రస్తుతం నాణ్యమైనటువంటి మద్యాన్ని సరసమైన ధరలకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు రాజన కొండ నాయుడు ,రావికమతం సర్పంచ్ గంజి మోది నాయుడు, బిజెపి నాయకులు గల్లా రాజేశ్వరరావు, జనసేన నాయకులు మైచర్ల నాయుడు ,రావికమతం ఎంపిటిసి వేపాడ నాగేశ్వరావు, గొంప ఎంపీటీసీ సూర్యనారాయణ, తట్టబంద సర్పంచు గోకివాడ రమణ, మరుపాక ఎంపీటీసీ సూర్యనారాయణ ,కొత్తకోట మాజీ సర్పంచ్ కోట నీలవేణి పాల్గొన్నారు.

చోడవరం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దీపం -2 లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, తహశీల్దారు ఎ.రామారావు, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీపీ కాసు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ వెంకట సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, జనసేన నాయకులు మూలు నాయుడు, ఎంపీటీసీ నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేటలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుతో కలిసి ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరి దేవి, కూటమి నాయకులు కోటేశ్వరరావు, గేదెల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక గాంధీనగరం టిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, బొద్దపు శ్రీనివాసరావు (జనసేన) గొర్లె నానాజీ (తెలుగుదేశం) తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామంలో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం దీపం పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జి, స్థానిక సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంట్లో టీ తయారు చేసిన కలెక్టర్

అనకాపల్లి : దీపం పథకం 2 కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా అనకాపల్లి పట్టణం గాంధీనగరం వీధి మావూరి రమణమ్మ ఇంటిలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్వయంగా టీ కాచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఆర్‌డిఒ షేక్ అయిషా పాల్గొన్నారు.

గోపాలపట్నం : సూపర్ సిక్స్ హామీలో భాగంగా దీపావళి కానుకగా మహిళలకు ఇస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని గోపాలపట్నం సత్య మహాలక్ష్మి గ్యాస్ఏజెన్సీ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగ ప్రశాంతి, జోనల్ కమిషనర్ హేమవతి, టిడిపి కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు వలందపేటలో ఉచిత వంట గ్యాస్ సిలిండర్లను లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్ర వారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి,జెడ్ సి, పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, తహశీల్దార్ పి రామారావు, యు సి డి, ఎపిడి వి కె దొర, టిడిపి నాయకులు కోరాడ రాజ బాబు పాల్గొన్నారు.

నిలిచిన ఎడ్ల బండ్లు

ఇసుక ఎడ్లబండ్లను అడ్డుకున్న నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక మండలంలో దుమారం రేపుతుంది. ప్రభుత్వం వాగులు, వంకల్లో ఇసుకను ఉచితంగా తీసుకు వెళ్ళవచ్చు అని ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఇసుక పథకానికి తూట్లు పొడుస్తున్నారు. మండలంలో గుర్తించిన గొట్టువాడ, పందూరు, కైలాసపట్నం గ్రామాలలో స్థానికులు కొందరు ఇసుకతో వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం కైలాస పట్నం నుండి ఇసుకను తీసుకువెళ్లేందుకు వచ్చిన ఎడ్లబళ్లను నాయకులు అడ్డుకున్నారు. ఇసుకను తరలించేందుకు వీలు లేదని బండిపై ఇసుకను దించేశారు. ఉచిత ఇసుకను ఎందుకు ఆపుతున్నారని ఎడ్ల బండ్ల యజమానులు కైలాస పట్నం నాయకులను అడగగా గొట్టువాడ, పందూరు, వెళ్లి తెచ్చుకోండి అని సమాధానం చెప్పారు. తమ గ్రామంలో కూడా ఇసుక వేలం నిర్వహిస్తామని, అంతవరకు ఇసుకను తరలించేందుకు అనుమతి ఇచ్చేది లేదని తెలిపారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుకకు నాయకులు తూట్లు పొడుస్తున్నారంటూ ఎడ్లబడ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమవరం చెక్ పోస్టు వద్ద నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నార్కోటిక్ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్ బృందంతో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి శచిదేవి

పింఛన్ల పంపిణీ ఆలస్యంపై పీడీ ఆరా

ప్రజాశక్తి-గొలుగొండ:అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ పిడి డాక్టర్ శచిదేవి శుక్రవారం ఉదయం గొలుగొండ మండలంలో పర్యటించారు. వెలుగు కార్యాలయంలో ఎంపిడిఓ మేరీరోజ్, వెలుగు ఏపీఎం కరుణానిధితో కలిసి పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు. శుక్రవారం సాయంత్రానికి పింఛన్లు 98 శాతం పూర్తవ్వాలని, పూర్తయ్యేటట్లు పర్యవేక్షించాలని ఆమె ఎంపిడిఓను ఆదేశించారు. అలాగే ఆన్‌లైన్ నెట్ వర్క్ డిస్ట్రిక్ కామర్స్‌లో ఆర్థిక లావాదేవీలు జరిగేలా స్థానికంగా ఉత్పత్తులను గుర్తించాలని వెలుగు ఏపిఎం కరుణానిధికి ఆమె సూచించారు. ఉదయం సమయంలో గంట మేర పెన్షన్ల పంపిణీలో జాప్యం జరగడంపై ఆరా తీశారు. సర్వర్‌లు మొరాయించడంతో ఆలస్యంగా పంపిణీ కార్యక్రమం జరిగిందని ఎంపిడిఓ వివరించారు. స్త్రీనిధి రుణాలు, బ్యాంక్ రుణాలు, ఎంసిపి రుణాల పంపిణీ, రికవరీపై వెలుగు ఏపిఎంతో చర్చించారు. వెలుగు నర్సీపట్నం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ కే.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:- విద్యాబోధనలో నైపుణ్యం కలిగించేందుకు ఉపాధ్యాయులకు మండల కేంద్రంలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రెండో విడత టీచింగ్ ఎట్ ధ రైట్ లెవెల్ (టార్ల్) శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సందర్శించి శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కారం చేసిన తర్వాతే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదనిసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు హెచ్చరించారు. నక్కపల్లిలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్‌కు సేకరించిన భూములలో ప్రభుత్వం ఆర్సెలాల్ మిట్టల్, విప్పన్ స్టీల్స్ సంయుక్తంగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయకుండా ఎలా ఏర్పాటు చేస్తారని ఆయన ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇల్లులు కోల్పోతున్న టువంటి వారికి ఎక్కడ పునరావసం కల్పిస్తారో ప్రభుత్వం నేటికీ స్పష్టం చేయలేదని, ఏ సంవత్సరానికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తారో, ప్యాకేజీ ఎంత చెల్లిస్తారో ప్రకటించలేదన్నారు. పేద సాగుదారులు సాగు చేసుకుంటున్న భూములకు పరిహారం చెల్లించలేదని, చట్ట ప్రకారం చెట్లకు, నిర్మాణాలకు, బోరుబావులకు చెల్లించవలసిన పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తారు. పరిశ్రమలు, అభివృద్ధి ఎంత ముఖ్యమో ఆ పరిశ్రమలు ఏర్పాటు కోసం త్యాగం చేస్తున్నటువంటి రైతులను, కూలీలను ఆదుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు కె.బుజ్జి, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాండవ కాలువ రైతుల పాట్లు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో తాండవ కాలువ కింద సాగు చేసుకుంటున్న వరి రైతుల పాట్లు వర్ణనాతీతం. ఖరీఫ్‌లో వరి పంట చివరి దశకు చేరుకుంది. పంట పొలాలకు నీరు ఎక్కువ అవసరం. ఈ సమయంలో తాండవ కాలువ గడిచిన 15 రోజులుగా రాకపోవడంతో రైతులు పలుమార్లు పలు విధాలుగా అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం పట్ల అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో రైతులు తాండవ సమీపంలో కాలువకు గండిపడ్డ ప్రాంతంలో స్వయంగా శ్రమదానంతో గండిని పూడ్చారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాండవ కాలువ మరమ్మతు పనులు చేపట్టి శాశ్వతంగా నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

మరమ్మతు పనులు చేస్తున్న రైతులు

వినతిపత్రం ఇస్తున్న నాయకులు, సర్పంచులు

సర్పంచ్‌ల ప్రమేయంతో అభివృద్ధి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు సర్పంచ్‌ల నిర్ణయం మేరకు నిర్వహించాలని జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావుకు వినతిపత్రం అందజేశారు. 25 శాతం పంచాయతీ నిధులు ఖర్చు చేస్తున్నా తమ ప్రమేయం లేకుండా ఇష్టానుసారంగా పనులు ఎలా ప్రారంభిస్తారని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులను, వంట మనుషులను, పారిశుధ్య కార్మికులను ఇష్టానుసారంగా మార్చేస్తున్న విషయంపై స్పందించాలని మండల కమిటీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి

-రాష్ట్ర హోం మంత్రి అనిత

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శుక్రవారం ఆమె వెంకన్నను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు ఆమెకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గరుడాద్రి పర్వతంపై గోపురం విస్తరణ చేపట్టాలని, గ్రామ తిరు వీధిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని, కళ్యాణ మండపం నిర్మించాలని, పుష్కరిణి అభివృద్ధి పరచాలని, భక్తులు వేచి ఉండేందుకు అన్ని వసతి సౌకర్యాలతో విశ్రాంతి భవనాలు నిర్మించాలని, శిథిలావస్థలో ఉన్న సత్రం తొలగించి, పునర్నిర్మాణం చేపట్టాలని, మార్చి నెలలో నిర్వహించిన స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో శివాలయం శిథిలావస్థలో ఉందని, సిజిఎఫ్ నిధులు మంజూరు చేసి ఆలయం పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. డంపింగ్ యార్డ్ కు స్థలం కేటాయించాలన్నారు.

ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సంబంధించి గుర్తించిన పనులకు గాను సంబంధిత అధికారులతో ఎస్టిమేషన్ వేయించి సమగ్ర నివేదిక రూపొందించి అందజేస్తే, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలని తహసిల్దార్ నరసింహమూర్తికి ఆదేశించారు. శిథిలంలో ఉన్న సత్రం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురుందాసు నూకరాజు, లాలం కాశీ నాయుడు, అబద్ధం, జానకి శ్రీను, ప్రగడ వీరబాబు, దొరబాబు, తోలేటి శ్రీనివాస్, వాసు, గింజాల లక్ష్మణరావు, మెరుగు నాగేశ్వరరావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనితకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నగదు బహుమతి ఇస్తున్న నరసింహారావు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో సత్తా

ప్రజాశక్తి -నక్కపల్లి:ఆర్‌బిఐ - 90 రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్వేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు రెండవ స్థానం సాధించారని కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీ సిహెచ్ విజయ ప్రకాష్ తెలియజేశారు. ఆర్.బి.ఐ - 90 వ వార్షికోత్సవ సందర్భంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం గత నెల సెప్టెంబర్ 19, 21 తేదీలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్లైన్ క్విజ్ స్క్రీనింగ్ పరీక్షలో ఏపీ నుండి సెలెక్ట్ అయిన 90 క్విజ్ టీములకు, ఈనెల అక్టోబర్ 28న విజయవాడ నోవాటెల్ లో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో 6 టీములను ఫైనల్ రౌండ్ కి సెలెక్ట్ చేయడం జరిగింది. ఈ ఫైనల్ రౌండ్ లో స్వేసెస్ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బీఎస్సీ విద్యార్థులు ఎన్ దేవి, జి. సత్య విజయ, రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించి 1.5 లక్షల నగదు బహుమానం, ప్రశంసా పత్రం కైవసం చేసుకున్నారని వెల్లడించారు.కళాశాల అధినేత సిహెచ్ వి కే నరసింహారావు విద్యార్థుల ప్రతిభను అభినందించి, ప్రోత్సాహంగా ఒక్కొక్కరికి 5 వేల చెక్కును బహుకరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి.-విశాఖ కలెక్టరేట్: ఈ నెల 19నుండి నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్ ను జివిఎంసి కమీషనర్ సంపత్ కుమార్ శుక్రవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జి.ఎస్ రాజేశ్వరరావు బాలోత్సవ కార్యక్రమ వివరాలను కమీషనర్ కు వివరించారు.విశాఖ బాలోత్సవం 19,20,21 తేదీల్లో సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్లో నిర్వహిస్తున్నామన్నారు, నవంబర్ 9 లోగా ఎంట్రీలను బాలోత్సవ కేంద్రానికి అందించాలని స్కూళ్లను కోరామని తెలిపారు. పెందుర్తి నుండి ఎన్ఏడి కొత్త రోడ్డు వరకు వున్న స్కూళ్ళ పిల్లలకు డిసెంబర్ లో వేరుగా నిర్వహిస్తామని తెలిపారు.కమీషనర్ సానుకూలంగా స్పందిస్తూ ,కోరిన సహాయ సహకారాలను తప్పక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, కమిటీ సభ్యులు సిహెచ్ సత్యనారాయణ, పి.లచ్చిరాజులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జివిఎంసి కమిషనర్

స్పీకర్ అయ్యన్నకు ఘన సన్మానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆయన సతీమణి పద్మావతిని నర్సీపట్నం బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాజయోగి రాంసులోక్ స్పీకర్ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడుతో బ్రహ్మ కుమారీస్ సంస్థ నిర్వాహకులు తమ అనుభవాలను పంచుకున్నారు. తాను మౌంట్ ఆబులో మూడు రోజులు గడిపానని, అక్కడి ఆధ్యాత్మికతతో కూడిన ప్రశాంత వాతావరణం తనను ఆకట్టుకున్నట్లు స్పీకర్ తెలిపారు. కార్తీక మాస ప్రారంభ దినం సందర్భంగా బ్రహ్మ కుమారీస్ తమను ఆహ్వానించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సంస్థ ఇంచార్జ్ వేణు, నర్సీపట్నం సెంటర్ బ్రహ్మ కుమారీస్ లక్ష్మి, లలిత, సోమేశ్వరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యాత్రలకు ఆర్‌టిసి బస్‌లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కార్తీక మాసం సందర్భంగా కార్తీకమాస ఆదివారాలు అయిన ఈ నెల 3,10,17,24 వ తేదీలలో విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం నుండి పంచారామాల సందర్శనకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు శుక్రవారం మీడియాని తెలిపారు. భక్తులు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఈ బస్సులు ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు అనగా సోమవారం ఉదయం అమరావతి చేరుకొని అమరావతి, భీమవరం,పాలకొల్లు, ద్రాక్షారామం,సామర్లకోట ఆలయాల దర్శనం పూర్తి చేసుకొని తిరిగి సోమవారం రాత్రికి విశాఖపట్నం చేరుతాయని తెలిపారు. విశాఖపట్నం నుండి పంచారామాల దర్శనమునకు వెళ్ళు సూపర్ లగ్జరీ చార్జి ఒక్కొక్కరికి (పెద్దలకు, పిల్లలకు రూ:2150, అల్ట్రా డీలక్స్ ఒక్కొక్కరికి చార్జి రూ:2100 టికెట్లు బుక్ చేసుకోవాలని అనుకునే వారు ద్వారకా బస్ స్టేషన్, ఫోన్ నెంబర్లు :9959225602, 90522270 83లకు సంప్రదించాలని తెలిపారు.

నర్సీపట్నం టౌన్ :పంచారామ క్షేత్రాలను దర్శించుకునే బస్‌లను నడపనున్నామని ఏపీఎస్ఆర్టీసీ నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నర్సీపట్నం డిపో నుండి ఈనెల 3,10,17,24, డిసెంబర్ 1న రాత్రి 7 గంటల నుండి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, అల్ట్రా డీలక్స్ బస్సులు బయలుదేరుతున్నాయని తెలిపారు. మరిన్ని వివరములకు 9494811855, 7382916377, 7382916318 పోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలియజేశారు.

దగ్ధమైన కంప్యూటర్లు

ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్‌లో అగ్నిప్రమాదం

-కంప్యూటర్లు, ఫర్నీచర్ దగ్ధం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:జైలు రోడ్డు జంక్షన్ లోఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ లో, గురువారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో,సుమారు 6 కంప్యూటర్లు, హోమ్ లోన్ క్యాబిన్, కరెంట్ హబ్ క్యాబిన్, మరో ఏడు కౌంటర్లు,ఫర్నిచర్, ఎలక్ట్రికల్ వస్తువులు, హాలు సీలింగు దగ్ధమయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్ లో చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో సుమారు రూ.34 లక్షల మేర ఆస్తి నష్టం కలిగిందని, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సికిందర్ కుమార్ సింగ్ మీడియాకు తెలిపారు. లాకర్, బ్యాంకు క్యాష్ సేఫ్ గా ఉన్నాయని చెప్పారు. ప్రమాదం సమాచారం తెలియగానే అగ్నిమాపక దళ సిబ్బంది హుటాహుటిన అక్కడ చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎలక్ట్రికల్ షార్ట్కట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు.

అధిక ధరలపై ఆందోళన

ప్రజాశక్తి-గొలుగొండ:నిత్యవసర ధరలు, విద్యుత్ చార్జీల ధరలను తగ్గించాలని, తక్షణమే స్మార్ట్ మీటర్లు పెట్టడం మానుకోవాలని సిపిఐ నాయకులు శుక్రవార ం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, ఉచితంగా గ్యాస్ బండలు పంపిణీ అని సామాన్య ప్రజలను ఊరిస్తూ, ప్రజలకు కనపడని వసూళ్ల దెబ్బ కొట్టడానికి ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీలను గుప్పించిన కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి వినియోగదారులపైన అదనపు ఆర్థిక భారాన్ని మోపడానికి సిద్ధపడిందన్నారు.ఈ ఛార్జీల పెంపుతో ప్రతి యూనిట్ పై గరిష్ఠంగా 1.58 రూపాయల అదనపు భారం పడనుందని, ఈ నవంబరు నుండి 16 నెలల పాటు ఈ అదనపు ఛార్జీలను వసూలు చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొల్లు గురు బాబు, నాయకులు మేకా సత్యనారాయణ, శివలంక కొండలరావు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న నేతలు

5 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-కోటవురట్ల:అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని తహసిల్దారు తిరుమలబాబు అన్నారు. శుక్రవారం ఆయన గొట్టువాడ గ్రామం వరహారధిలో ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న 5 ఇసుక ట్రాక్టర్ వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను తరలించే వాహనాలు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేని వాహనాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టెంట్ నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి

ప్రజాశక్తి -అరకులోయ:ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో క్యాంపింగ్ టెంట్లు నిర్వహించే టెంట్ నిర్వాహకులు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అరకులోయ ఎంపీడీవో లవ రాజు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనేక చోట్ల టెంట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు అనుమతులు తీసుకోలేదని, పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్ ఆదేశాల మేరకు మూడు నెలలకు సంబంధించిన టెంట్ రుసుము ఐటిడిఏ నిర్ధారించిన ప్రకారం అప్లికేషన్లు సమర్పించి చెల్లించాలని ఆయన అన్నారు. క్యాంప్లింగ్ స్థలంలో మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. టెంట్లో బస చేసే పర్యాటకుల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని వారి ఆధార్ కార్డులు విధిగా తీసుకోవాలని సూచించారు.